క్లుప్తంగా

1,306 మందికి ఇళ్ల వద్దకే పింఛన్లు

• ఎంపీడీవో యాదగిరీశ్వర్రావు


శరభవరంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో యాదగిరీశ్వర్రావు

రాజవొమ్మంగి: మండల వ్యాప్తంగా 1,306 మందికి పింఛన్లను వారింటికే వెళ్లి ఇస్తున్నామని ఎంపీడీవో ఎల్. యాదగిరీశ్వర్రావు తెలిపారు. మండలానికి మొత్తం 6,533 పింఛన్లు మంజూరు కాగా, వాటిలో 5,227 మంది పింఛను సొమ్ము వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు పేర్కొన్నారు. ఇంటింటికీ పింఛన్ల పంపిణీ మరో మూడు రోజులు చేపడతామన్నారు. శనివారం సాయంత్రానికి 60 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యిందన్నారు. సచివాలయ, ఆర్బీకే సిబ్బంది ఈ పింఛన్ల పంపిణీలో నిమగ్నమై ఉన్నారన్నారు.

వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడం ఖాయం


పసుపులేటి యోషేప్

చింతపల్లి రూరల్: అల్లూరి జిల్లాలో మూడో సారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడం ఖాయమని పార్టీ యువ నాయకుడు పసుపులేటి యోషేప్ తెలిపారు. ఈ నెల 4న వెలువడనున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ పాడేరు ఎంపీ అభ్యర్థి తనూజరాణి, ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు విజయం సాధించడం ఖాయమన్నారు. గత ఎన్నికల్లో వచ్చిన మెజారిటీని మించి ఈ ఎన్నికల్లో గెలుపు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

రేపు సర్వసభ్య సమావేశం

మారేడుమిల్లి: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 3వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎంపీపీ సార్ల లలితకుమారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వీరా కిశోర్ శనివారం ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరు కావాలన్నారు.

25.2 మెట్రిక్ టన్నుల వరి వంగడాలు సిద్ధం


రాజవొమ్మంగి ఆర్బీకేలో ఖరీఫ్ విత్తనాలను భద్రపరుస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి: మండలంలో రెండు రైతు భరోసా కేంద్రాలకు తొలి విడతగా 25.2 మెట్రిక్ టన్నుల ఖరీఫ్ వరి విత్తనాలు వచ్చాయని ఏవో రమేష్‌నాయుడు శనివారం తెలిపారు. జడ్డంగి ఆర్బీకేకు 11.7, రాజవొమ్మంగి ఆర్బీకేకు 13. 5 టన్నుల ఎంటీయూ 1318 రకం వరి వంగడాలు సరఫరా అయినట్లు చెప్పారు. వీటికి మొలక కట్టి, ఎన్నికల కోడ్ నాల్గో తేదీ అనంతరం రైతులకు పంపిణీ చేస్తామన్నారు.

ల్యాబ్ అసిస్టెంట్ మృతికి సంతాపం


కోటిలింగం (ఫైల్)

చింతపల్లి రూరల్: స్థానిక గిరిజన సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ల్యాబ్ అసిస్టెంట్ ఎస్.కోటిలింగం మృతికి పలువురు సంతాపం తెలిపారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శుక్రవారం రాత్రి తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

‘ఏకలవ్య’ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

మారేడుమిల్లి: స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఇటీవలే నిర్వహించిన పరీక్షల ఫలితాలు విడుదల చేసినట్టు ప్రిన్సిపాల్ టి. అరుణా కుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షల్లో ఎంపికైన విద్యార్థుల వివరాలను పాఠశాల నోటీస్ బోర్డులో పెట్టామన్నారు. ఈ నెల 5 నుంచి 15 తేదీ వరకు అడ్మిషన్లు జరుగుతాయన్నారు. ప్రవేశ పరీక్షల్లో అర్హత పొందిన వారు ఆన్‌లైన్ మార్కులిస్ట్, సంబంధిత సర్టిఫికెట్లతో పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.


అనంతగిరి: బొర్రా రైల్వే స్టేషన్ వద్ద పూజలు చేస్తున్న భక్తులు


చింతపల్లి రూరల్: చౌడుపల్లిలో హనుమాన్ ఆలయానికి సారె తీసుకెళ్తున్న భక్తులు


కొయ్యూరు: ఆడాకులలో భక్తులకు వడ్డన చేస్తున్న వైస్ ఎంపీపీ వెంకటరమణ


గంగవరం హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అంజనీపుత్ర... నీవే రక్ష


అడ్డతీగల: పవనగిరి క్షేత్రంలో అభయాంజనేయ స్వామి వారికి పూజలు చేస్తున్న భక్తులు


వీఆర్‌పురం: చింతరేగుపల్లిలోని అభయాంజనేయ స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు


జి.మాడుగుల: భజన కార్యక్రమంలో సద్గురు సేవాశ్రమం అధిపతి సాయిరాం స్వామీజీ


గంగవరం: నెల్లిపూడిలో గిరిజన మహిళల నృత్యాలు


రంపచోడవరంలో హనుమాన్ జయంతి వేడుకలు


ఎటపాక: స్వామి వారికి పూజలు చేస్తున్న భక్తులు

అనంతగిరి: హనుమాన్ జయంతి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆంజనేయస్వామివారి ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. శనివారం తెల్లవారుజాము నుంచే భక్తుల రాక మొదలైంది. స్వామివారికి అభిషేకాలు, ఆకుపూజలు నిర్వహించారు. సామూహికంగా హనుమాన్ చాలీసా పఠనం చేశారు. బొర్రా రైల్వే స్టేషన్ వద్ద శనివారం ప్రసన్నాంజనేయం గుడి వద్ద వేకువజాము నుంచే భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద పూజా కార్యక్రమంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

కొయ్యూరు: హనుమాన్ జయంతిని గ్రామగ్రామాన నిర్వహించారు. శనివారం ఉదయం నుంచే హనుమాన్ ఆలయాల వద్ద భక్తులు చేరుకుని పూజలు చేశారు. దుష్ట శక్తుల నుంచి కాపాడే పేరున్న హనుమాన్‌ను చల్లగా చూడాలని కోరారు. ఈ సందర్భంగా అనేక ఆలయాల్లో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆడాకులలో వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ పాల్గొని భక్తులకు వడ్డన చేసి అన్నసమారాధన ప్రారంభించారు.

చింతపల్లి రూరల్: కంఠ రమణ దంపతుల ఆధ్వర్యంలో చౌడుపల్లిలో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హనుమాన్ మందిరం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కంఠ జాహ్నవి, కంఠ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


రాజవొమ్మంగిలో ఆంజనేయస్వామి

రాజవొమ్మంగి: మండల వ్యాప్తంగా శనివారం హనుమజ్జయంతి శనివా రం భక్తిశ్రద్ధలతో జరిగింది. స్థానిక ఆంజనేయ స్వామివారి ఆలయం వద్ద పూజల అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దూసరపాము, లాగరాయి, జడ్డంగి, చెరకుంపాలెం తదితర గ్రామాల్లోనూ వేడుకలు జరిగాయి.

అడ్డతీగల: మండల వ్యాప్తంగా శనివారం హనుమజ్జయంతి ఘనంగా నిర్వహించారు. పవనగిరి క్షేత్రంలోని భారీ అభయాంజనేయస్వామి విగ్రహానికి తమలపాకుల మాలను వేసి గిరిజన భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామివారికి వివిధ వంటకాలతో నైవేద్యాన్ని సమర్పించారు. మండలంలోని వివిధ ప్రాంతాల్లోని ఆంజనేయ స్వామి విగ్రహాల వద్ద ప్రజలు విశేష పూజలు నిర్వహించి అన్నదాన ప్రసాదాలను అందజేశారు.

వీఆర్‌పురం: మండలంలో హనుమాన్ జయంతి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. వీఆర్‌పురంలోని బీసీ కాలనీలో అభయాంజనేయ స్వామివారి ఆలయంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉమ్మిడివరం, చింతరేగుబల్లి గ్రామాల్లోని ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. మండల ధర్మ ప్రచారక్ ఎం.శ్రీరామకృష్ణయ్య, ఎల్. సుధాకర్, గూటాల పుల్లేష్, ముత్యాల ముత్యాలరావు, మరిడీ గూటాల సీతారాం పాల్గొన్నారు.

గంగవరం: మండలంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక హనుమాన్ ఆలయంలో భక్తులు పాల్గొని విశేష పూజలు చేశారు. నెల్లిపూడి అభయాంజనేయ స్వామి గుడిలో ఆలయ వ్యవస్థాపకుడు దాసరి వెంకటేశ్వరరావు దంపతులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. జగ్గంపాలెం కోలాట బృందం ప్రదర్శించిన నృత్యాలు ఎంతో అలరించాయి. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎటపాక: హనుమాన్ జయంతి వేడుకలు శనివారం మండలంలో వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా గౌరిదేవిపేట, తోటపల్లి, గన్నవరం అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జి.మాడుగుల: మండలంలో హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించారు. గాంధీనగర్ గ్రామంలోని హనుమ సేవాశ్రమంలో పంచముఖ ఆంజనేయ స్వామివారి మందిరంలో విశాఖపట్నం జిల్లా భీమిలి సద్గురు సేవాశ్రమం, హనుమ సేవాశ్రమం ప్రతినిధి సాయిరామ్ స్వామిజీ(యోగరాజు) ఆధ్వర్యంలో ద్వితీయ వార్షికోత్సవం నిర్వహించారు. ఆలయ సన్నిధిలో జల, క్షీర, పంచామృతాభిషేకం చేశారు. సహస్రనామ పూజలు, సకల కార్యసిద్ధికి సుదర్శన హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంతబయలు, దేవునిగెడ్డ, కె.కోడాపల్లి, వనెల్బ, వంజరి, గెమ్మెలి, మహాదేవపురం, కుల్లపాడు తదితరల గ్రామాల్లో అన్నసమారాధన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

సీలేరు: స్థానిక రామాలయం సెంటరు వద్ద అభయాంజనేయ స్వామి విగ్రహానికి పంచామృతాభిషేకం, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి నూతన వస్త్రాలంకరణ, తరువాత ఆకుపూజ, సింధూరపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రంపచోడవరం: స్థానిక కోదండ రామాలయంలో మండప హనుమమూర్తికి అర్చకులు యజ్ఞసూర్య సాయికిరణ్, మంతా సత్యనారాయణ సిద్ధాంతి, అదేవిధంగా విరాట్ విజయ ఆంజనేయ స్వామి ఆలయంలో మూలవిరాట్‌కు విరియాల వేంకటేశ్వరరావు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాలికల ఆత్మరక్షణకు కరాటే


కరాటే శిక్షణ ఇస్తున్న పాండురాజు

చింతపల్లి రూరల్: ఆపద సమయంలో బాలికల ఆత్మరక్షణకు కరాటే శిక్షణ దోహదపడుతుందని స్టూడెంట్స్ కోపుకాన్ కరాటే క్లబ్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, ఎగ్జామినర్ బాకూరు పాండురాజు తెలిపారు. శనివారం స్థానిక గ్రంథాలయ ఆవరణంలో సమ్మర్ క్యాంప్‌లో భాగంగా కరాటే, యోగా శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. చదువుతోపాటు క్రీడలు, కరాటే, యోగా వంటి వాటిలో బాలబాలికలు రాణించాలని ఆకాంక్షించారు. ఇటువంటి శిక్షణ తీసుకోవడం వల్ల ఆరోగ్యంతోపాటు శారీరక దారుఢ్యం కలుగుతుందన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి సూర్యనారాయణ, శిక్షకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మారుమూల ప్రాంతాల్లోనూ వైద్య సేవలు


సీలేరు: రోగులకు వైద్యం అందిస్తున్న వైద్యాధికారి సౌమ్య

సీలేరు: వైఎస్సార్‌సీపీ పాలనలో మన్యంలోని మారుమూల ప్రాంతాల్లోనూ వైద్య సేవలందుతున్నాయి. ఇందులో భాగంగా దుప్పులవాడ సచివాలయం పరిధిలో వలసగెడ్డ, శాండ్‌కోరి గ్రామాల్లో వైద్యాధికారి సౌమ్య శనివారం పర్యటించారు. ప్రతీ ఇంటికి వెళ్లి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని మందులు ఇచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, వృద్ధులకు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులను పరీక్షించి మందులు ఇచ్చారు. వీలైనంతగా ద్రవ పదార్థాలు తీసుకోవాలని, శీతల పానీయాలు తాగవద్దని సూచించారు. ఆరోగ్య పర్యవేక్షకుడు త్రినాథ్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.


రాజవొమ్మంగి: పూదూడిలో రోగులకు వైద్య సహాయం అందిస్తున్న దృశ్యం

48 మందికి పరీక్షలు..

రాజవొమ్మంగి: పూదూడి, పాకవెల్తి గ్రామాల్లో శనివారం ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం నిర్వహించారు. 48 మంది రోగులను వైద్య సిబ్బంది పరీక్షించారు. గర్భిణులకు, బాలింతలకు పరీక్షలు చేసి రక్తహీనత తదితర సమస్యలను గుర్తించారు. బీపీ, సుగర్ సమస్యలను ఉన్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. హెచ్‌వీ చిన్నయమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ భవాని, ఏఎన్‌ఎం వీవీ లక్ష్మి, ఆశ వర్కర్లు, 104 డీఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

అడిషినల్ ఎస్‌ఐ సేవలు అభినందనీయం


అడిషినల్ ఎస్‌ఐ జేఆర్బీ రెడ్డిని సన్మానిస్తున్న ఏఎస్పీ జగదీశ్ అడహళ్లి

గంగవరం: అడిషినల్ ఎస్సై జేఆర్బీ రెడ్డి సేవలు అభినందనీయమని రంపచోడవరం ఏఎస్పీ జగదీశ్ అడహళ్లి, సీఐ రవికుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో అడిషినల్ ఎస్‌ఐగా జేఆర్బీ రెడ్డి పదవీ విరమణ చేశారు. శనివారం రంపచోడవరం ఏఎస్పీ కార్యాలయంలో ఎస్‌ఐ బి. రామకృష్ణ ఆధ్వర్యంలో జేఆర్బీ రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. ఎస్సై రజాక్, సిబ్బంది శ్రీను, రత్నం, సాయి, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని గిరిజన మహిళ మృతి

నర్సీపట్నం: మున్సిపాలిటీ పీనారపాలెం కల్పన థియేటర్ వద్ద లభించిన గిరిజన మహిళ మృతదేహన్ని బంధువులకు అప్పగించామని టౌన్ ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆయన అందించిన వివరాలు ఇలా వున్నాయి. లభ్యమైన మహిళ మృతదేహం జి.మాడుగుల మండలం, గోద్దు పాలెం గ్రామానికి చెందిన జి.లక్ష్మిగా సోదరి వి. పుష్ప గుర్తించింది. మృతురాలు ఏడేళ్లుగా మతిస్థిమితం లేక బాధపడుతోంది. వారం రోజుల క్రితం మృతురాలు ఊరు నుండి వచ్చేసింది. కల్పన థియేటర్ వద్ద మృతి చెందింది. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని ఆమె బంధువులకు అప్పగించామని ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.

మైదాపిండి లోడు లారీ బోల్తా

యలమంచిలి : మున్సిపాలిటీ పెదపల్లి-రామ్‌నగర్ హైవే సమీపంలో శనివారం ఒక లారీ బోల్తాపడింది. ఒరిస్సా నుంచి విజయవాడకు మైదా పిండి బ్యాగ్‌ల లోడుతో వెళుతున్న లారీని యలమంచిలి పెదపల్లి జంక్షన్ సమీపం వద్దకు ఉదయం 10.30 గంటల సమయంలో వచ్చేసరికి డ్రైవర్ నిద్రమత్తు కారణంగా లారీ హైవే పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి పల్టీలు కొట్టి సమీపంలో కాలువలో పడిపోయింది. లారీ డ్రైవర్‌కు క్లీనర్‌కు స్వల్పంగా గాయపడ్డారు. లారీ క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను క్లీనర్‌ను స్థానికులు హుటాహుటిన బయటకు తీసి యలమంచిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

9 నుంచి పెదబయలు మోదకొండమ్మ జాతర

• నేడు ఉత్సవాల ముహూర్తపు రాట కార్యక్రమం

పెదబయలు: మన్యం ప్రజల ఆరాధ్యదైవం పెదబయలు మోదకొండమ్మ తల్లి ఉత్సవాలు ఈ నెల 9, 10, 11 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ పెద్దలు తెలిపారు. ఉత్సవాల ప్రారంభానికి సంబంధించి ఆలయంలో ఆదివారం ఉదయం 8.45 గంటలకు శతకం పట్టు వద్ద ముహూర్తపు రాట వేస్తామన్నారు. ఏటా పాడేరు మోదకొండమ్మ ఉత్సవాల తర్వాత ఇక్కడ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఏడాది ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పాడేరు పండగ తేదీల్లోనే పెదబయలులో జాతర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని కమిటీ నాయకులు, గ్రామ పెద్దలు, వర్తకులు కోరారు.

మలేరియా వారోత్సవ ర్యాలీ


రాజవొమ్మంగిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రాజవొమ్మంగి: మలేరియా వారోత్సవాల సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సుష్మా ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ జరిగింది. మలేరియా, డెంగీ వ్యాధులు బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్‌యూవో ప్రసాద్, ఎంటీఎస్. సోమరాజు, ఎల్టీలు తమ్మారావు, వెంకటలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ సంపత్ కుమార్, లక్ష్మణ్, హెల్త్‌అసిస్టెంట్ నానిబాబు, లక్ష్మయ్య స్థానికులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

కొయ్యూరు: విద్యుత్ తీగలు తెగి దుక్కిటెద్దుపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన శనివారం బూదరాళ్ల పంచాయతీ చౌడుపల్లిలో చోటు చేసుకుంది. సాయంత్రం మెరుపులతో పాటు ఉరుములు రావడంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయింది. దీనిమూలంగా తెగిన విద్యుత్ తీగలు ఎద్దుపై పడ్డాయి. ఎద్దు మృతితో బాధిత రైతు పొత్తూరు భీమయ్యకు భారీగా నష్టం వాటిల్లిందని సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డు సభ్యుడు సంజీవ్ తెలిపారు. అధికారులు రైతును ఆదుకోవాలని కోరారు.

జీవాలకు చిటుక వ్యాధి నివారణ టీకాలు

పాడేరు: పశువులు, మేకలు, గొర్రెలకు సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల వాటి యజమానులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సీహెచ్ నర్సింహులు తెలిపారు. మండలంలోని వంజంగి పంచాయతీ కొత్తవలసలో శనివారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. 185 పశువులకు, 212 మేకలకు, గొర్రెలకు చిటుక వ్యాధి నివారణ టీకాలు, నట్టల నివారణ మందు వేశారు. అనంతరం వాటి యజమానులకు మందులను పంపిణీ చేశారు. జీవాలకు సకాలంలో నట్టల నివారణ ముందు వేయించాలని సూచించారు. వంజంగి సర్పంచ్ బొంజుబాబు, వంతమమైడి పశువైద్యాధికారి రాజీవ్ కిశోర్, పశు సంవర్ధక శాఖ సహాయకులు శ్రీనుబాబు, కోటిబాబు, అమృత సంస్థ కార్యదర్శి సంతోస్ గోవర్ధిని, రోజ్‌మేరి, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పథకంపై శిక్షణ


వంటకాలను పరిశీలిస్తున్న ఎండీఎం ఏడీ అప్పారావు, ఎంఈవో బాబూరావు పడాల్


మారేడుమిల్లి: మాట్లాడుతున్న ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ రాంబాబు

జి.మాడుగుల: ప్రభుత్వం పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం విద్యార్థులకు సంబంధిత కమిటీలు అమలు చేయాలని ఎండీఎం అడిషనల్ డైరెక్టర్ జి. అప్పారావునాయుడు, ఎండీఎం కోర్డినేటర్ వి. వెంకటరమణ, ఎంఈవో చిట్టపులి బాబూరావు పడాల్ తెలిపారు. మండలంలో గాంధీనగరం ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజన నిర్వహణ కమిటీలకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. అనంతరం వంటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నాణ్యత, రుచిగా వండిన వారికి బహుమతులు అందజేశారు. ఎంఐసీ, సీఆర్పీలు, సీసీహెచ్‌లు 200 మంది హాజరయ్యారు.

వంటమ్మలకు ఒక్క రోజు శిక్షణ

మారేడుమిల్లి: స్థానిక గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమ పాఠశాలలో వంటమ్మలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డి. రాంబాబు వంటమ్మలకు దిశా నిర్దేశం చేశారు. శిక్షణలో భాగంగా నాణ్యమైన, రుచికరమైన భోజనం ఎలా తయారు చేయాలి, వంటగది, పాత్రల పరిశుభ్రత, పదార్థాలు కలుషితం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వంటలు చేసే వారు ధరించాల్సిన దుస్తులు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. రోజూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో తమ్మరావు, సీఆర్పీలు రాజారెడ్డి, మధు, విల్సన్ పాల్గొన్నారు.

పన్నెడ గ్రామ సమీపంలో టిప్పర్ బోల్తా

చిప్స్ లోడ్‌తో వస్తూ ప్రమాదం


నిలిచిపోయిన ట్రాఫిక్


రోడ్డుకు అడ్డంగా బోల్తా పడిన టిప్పర్ లారీ

పెదబయలు: మండలంలోని సీకరి పంచాయతీ పన్నెడ గ్రామ సమీపంలో టిప్పర్ లారీ బోల్తా పడింది. పాడేరు నుంచి నల్లరాయి పిక్క (చిప్స్) పెదబయలు తీసుకొస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే క్రమంలో రోడ్డు అంచుదిగి బోల్తా పడింది. డ్రైవర్ కామేష్, రాజులకు ఎలాంటి గాయాలు కాలేదు. అయితే టిప్పర్ రోడ్డుకు అడ్డంగా పడడంతో గంట పాటు ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది. పెదబయలు పోలీసులు, మోటార్ యూనియన్ సభ్యులు వచ్చి టిప్పర్‌ను పక్కకు తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.